
# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

05-02-2005 (10)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్, పిన్ : 534 265

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 07-02-05 | సోమ | గుమ్మలూరు |
| 09-02-05 | బుధ | మురమళ్ళ, వీరేశ్వరస్వామివారి దేవస్థానం |
| 10-02-05 | గురు | భీమవరం, క్షత్రియ పరిషత్ భవనము |

# ఆత్మ ధ్యాసే జ్ఞానం

మన హృదయంలో మన మనస్సు నిశ్చలంగా ఉండటమే జ్ఞానం. అదే భక్తి, అదే కర్మ, అదే యోగము. మనస్సు భావశూన్య సద్భావ స్థితిలోకి రావడము ఆత్మానుభవము వేరు కాదు. గాలివేగం వల్ల అలలతో ఎగసిపడే కొలను, గాలి ఆగితే నిశ్చలంగా, గంభీరంగా, కేవలంగా నిలుస్తుంది. అలాగే ఆలోచనా ప్రవాహం ఆగితే మనస్సు నిర్మలత్వం చెంది ఆత్మాకారం చెందుతుంది. ఆత్మ ధ్యాస లేకపోతే వాసనలు, మనస్సును కుదురుగా ఉండనియ్యవు. మనస్సు దాని అలవాట్లు అది మాననప్పడు, మన అభ్యాసం మనం విడిచిపెట్టకూడదు. సముద్రంలో ఒక రకమైన ముత్యపు చిప్ప ఉంటుంది. అది నీటి ఉపరితలంపై ఈదులాడుతూ ఉంటుంది. స్వాతి నక్షత్ర కాలంలో వానచినుకు దాని నోట్లో పడితే అది తన నోటిని బంధించి, సముద్రపు అడుగునకు చేరి, స్వచ్ఛమైన ముత్యం తయారయ్యే వరకూ తన నోటిని తెరువదు, ఆ ధ్యాస అటువంటిది. అలాగే ఆధ్యాత్మిక సాధకుడు ఆత్మ సాధన చేస్తూ, పరిపక్వ స్థితికి వచ్చిన తరువాత, సద్గురువు దొరికినప్పడు "నీవు ఆత్మే" అన్న ఆయన ఉపదేశాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి, ఏకాగ్రతను సాధించి, నోటిని, చెవులను, కళ్ళను, చెడు విషయాలపై వెళ్ళకుండా మూసుకొని, ఆత్మ ముత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకొంటాడు. మనస్సు బహిర్ముఖం అవ్వటానికి ఈ మూడు ఇంద్రియాలే ప్రధాన ద్వారాలుగా ఉండి, మనలో భ్రాంతులను ప్రవేశించటానికి కారణమౌతున్నాయి. తన ఇంద్రియాలను నిత్యం తృప్తి పరచటానికి మానవుడు విశ్రాంతి లేకుండా ప్రకృతిలో సంతోషం కోసం వెదుకుతూ ఉంటాడు. అవికొన్ని పొందినపుడు, కొన్ని పొందలేనప్పడు, కలిగే రాగ-ద్వేషాల రాపిడిలో సతమతమౌతూ, తాను వేరు ప్రకృతి వస్తువులు వేరని, నిత్యం భ్రమిస్తూ జీవిస్తాడు. ఈ మాయా భ్రమణం ఆగాలంటే, ప్రకృతి వస్తువుల్లో నిజమైన ఆనందం దొరకదని గురుబోధతో నిశ్చయజ్ఞానంతో, మనస్సు ధృడపడినప్పడు మాత్రమే, ఆత్మధ్యాసలో సుఖంగా ఉంటాడు. "కోరికలు నశిస్తే మనస్సు నశిస్తుంది. అహంకార పంజరం నుండి బైట పడ్డ పక్షివలె భ్రాంతిని విడిచి ఆత్మానుభవంలో స్వేచ్ఛగా ఉంటుంది" అంటోంది యోగవాసిష్ఠము. కాబట్టి భ్రాంతులను వదలి జ్ఞానాన్ని పొందాలి.

సాగిరాజు రామకృష్ణంరాజు

అర్ధవరం



ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు



సంపుటి : 10 సంచిక : 10 పుష్యం : 21-22 05-02-2005



రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి

(హైమ)

చందా

సంవత్సర చందా: రూ|| 150/-

విడి ప్రతి: రూ|| 5/-



చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణక్షేత్రం,

జిన్నూరు - 534 265

ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో.....


11-12-04

గొరగనమూడి .......... 1

16-01-05

జిన్నూరు .................. 9



ప్రింటర్

భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

ఎస్‌వీఆర్ కాంప్లెక్స్, పాలకొల్లు

☎ 08814 - 228858


## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 11-12-04, గొరగనమూడి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జ్ఞానానందస్వామికి విషయజ్ఞానం ఉంది, అమృతానుభవం ఉంది. అంటే ఒక ప్రక్క సైంటిస్టు అయ్యారు, ఒక ప్రక్క సెయింట్ అయ్యారు. జ్ఞానానంద కూడా జ్ఞానే అయితే ఆయన దేహప్రారబ్ధాన్నిబట్టి సైన్సు రంగంలో విశేషంగా కృషిచేసారు. ఆయన పూర్ణ మానవుడు. ఎక్కడ మహాత్ముడు ఉన్నాడో, ఎక్కడ మహర్షి ఉన్నాడో అది తీర్థం, అదే పుణ్య క్షేత్రం. మానవుడికి ఎన్ని ఉన్నా వాడికి ఆనందం కావాలి, శాంతి కావాలి. నాకు ఆనందం అవసరం లేదు, శాంతి అవసరం లేదని చెప్పేవారు సృష్టిలో ఎవరూ లేరు. సూర్యుడికి ప్రకాశం ఎంత సహజమో, చంద్రుడికి చల్లదనం ఎంత సహజమో, అగ్నికి వేడి ఎంత సహజమో అలాగే మన హృదయంలో ఉన్న సద్వస్తువుకు ఆనందం, శాంతి అంత సహజం, దేహం ఉన్నా లేకపోయినా లోకం కనిపించినా కనిపించకపోయినా ఆ వస్తువు ఉండటం కూడా అంతే సహజం. మీరు సబ్జక్టును క్లోజుగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. మీరు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకొంటూ ఉంటే 90% వరకు దుఃఖరహితస్థితి అందుకోగలుగుతారు. లోపల ఉన్న సద్వస్తువుకు ఆనందం సహజం. అది గుణంకాదు, అది కల్పించుకొన్నది కాదు. సూర్యుడికి ప్రకాశం అనేది సహజస్వభావం, అది గుణం కాదు. ఎన్నిసార్లు చెప్పినా వాడు అలా మాట్లాడుతాడు ఏమిటి అని ఎవరితోనైనా అంటే అది వాడినేచరండి, అదివాడి స్వభావం అని చెప్తారు. అంటే వాడి స్వభావాన్ని జయించటం కష్టం, అతను ప్రయత్నం

చేస్తున్నా ఫెయిల్ అవుతూ ఉంటాడు. ఒకో మానవుడికి ఒకో స్వభావం ఉంటుంది, దానిని జయించటం కష్టం. గురువు అనుగ్రహం లేకుండా, ఈశ్వరానుగ్రహం లేకుండా మన స్వభావాన్ని జయించటం కష్టం. ఇప్పుడు మనోదేహములు మనకు ఎలాగయితే అనుభవంలో ఉన్నాయో అలాగ లోపల ఉన్న వస్తువుతో మనకు తాదాప్యం వచ్చేవరకు, అందులో మనం ఏకం అయ్యేవరకు, నేను అనేటప్పటికి లోపల ఉన్న బ్రహ్మం నాకు స్ఫురించే వరకు ఏదో వెలితి, ఏదో కొరత, ఏదో దుఃఖం ప్రతీ మానవుడిని వెంటాడుతూ ఉంటుంది. మీకు ఎంత ధనం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా లోపల ఉన్న వస్తువు తాలూకా అనుభవం మీకు వచ్చే వరకూ ప్రతిజీవుడిని ఏదో వెలితి, ఏదో భయం వెంటాడుతూ ఉంటాయి. ఉన్నది ఒక్కటే అంటే ఒక్కటే, ఆ ఒక్క దానిలో నీవు భిన్నత్వం చూస్తూ ఉంటే నీకు సంసారం ప్రారంభమవుతుంది, భయం నిన్ను విడిచిపెట్టదు, శవాలు మోయటం నీకు తప్పదు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమయ్యే వరకు నీకు జన్మలు వస్తూనే ఉంటాయి. అశాంతి నిన్ను విడిచిపెట్టదు అని సనత్కుమారుడు నారదుడితో చెప్పాడు. జీవుడు ఏ దేహంలో ఉన్నా ప్రతీ జీవుడి యొక్క గమ్యం అంటే వాడి హృదయంలో ఉన్న సద్వస్తువుతో తాదాప్యం పొందటమే జీవుడి యొక్క లక్ష్యం. అప్పటివరకు జీవుడి యొక్క యాత్రకు ముగింపులేదు. ఆ సద్వస్తువును చేరుకునే వరకూ చావులేని స్థితి వాడికి స్వరూపంగా వ్యక్తం కాదు. ఉన్నది ఒక్కటే కాని దానికి మనం వేరుగా ఉన్నాము అనే తలంపు ఎప్పుడయితే వచ్చిందో అక్కడ నుండీ దుష్టబుద్ధి ప్రారంభ మయ్యింది. స్వార్థం, దేహాభిమానం ప్రారంభమైంది అక్కడనుండి మన పతనం ప్రారంభమైంది. జ్ఞానానంద అంటే జ్ఞానంలో ఆనందిస్తున్నారు కాబట్టి ఆయన జ్ఞానానంద కాని మనం విషయాలలో ఆనందిస్తున్నాము. జ్ఞానం సత్యం, అజ్ఞానం అసత్యం, జ్ఞానం నిత్యం అజ్ఞానం అనిత్యం, జ్ఞానం సుఖాన్ని ఇస్తుంది అజ్ఞానం దుఃఖాన్ని ఇస్తుంది. నేను అనే భావన ఎక్కడ నుండి ఉదయించి వస్తుందో, నేను అనే భావనకు ఏదైతే కేంద్రంగా ఉందో ఆ కేంద్రం నీకు గోచరంకానంత కాలం నీకు దుఃఖం తప్పదు, నీవు ఎన్ని జన్మలు ఎత్తినా దుఃఖం నిన్ను తరుముకొంటూ వస్తుంది. జ్ఞానం అంటే విషయ జ్ఞానం కాదు, నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక అనుభవం జ్ఞానం. భగవాన్ ఏమి చెప్పారు అంటే జీవుడు తన వేషం తాను తీసివేస్తే, ఈశ్వరుడు ఆయన వేషం తీసివేస్తే ఉన్నదేదో మిగులుతుంది, అది ఫైనల్‌స్టేట్, అది పొందేవరకు నిన్ను వెలితి వెంటాడుతుంది, అశాంతి నిన్ను వెంటాడుతుంది. కాలం కూడా నిజం కాదు,

కాలం కూడా కల్పితం, గాఢనిద్రలో ఎవరికి టైమ్‌సెన్స్ లేదు, గాఢనిద్రలో ద్వైతం లేదు అయితే గాఢనిద్రలో మనం లేమా అంటే మనం ఉన్నాము. నువ్వు జీవించి ఉండగానే, ఈ శరీరంలో ఉండగానే మరణించాలి, మరల అదే శరీరంలో జన్మించాలి. మనస్సు విషయాలను కల్పిస్తుంది, వస్తువులను కల్పిస్తుంది. అది కల్పించిన విషయాల మీద, వస్తువుల మీద మమకారం పెంచుకొని బంధింపబడుతుంది. విషయాలను కల్పించేది మనస్సే, అందులో బంధింపబడేది మనస్సే. వస్తువులను కల్పించేది మనస్సే, మరల ఆ వస్తువులను కోరుకొనేది మనస్సే. ప్రేమ, ద్వేషము, రాగము, అనురాగము ఇన్ని గొడవలు లేనేలేవు నీకోరికే ప్రేమ, నీ కోరికే ద్వేషం, కోరికే ఇష్టం, కోరికే అయిష్టం. నీకు కోరికంటూ లేనప్పడు ఇష్టాలు,. అయిష్టాలు ఏమిటి? ఇవన్నీ కోరికలో నుండే వస్తున్నాయి. నాకు వాడంటే ఇష్టం, వీడంటే అయిష్టం అంటే నీకు ఏదో లోపల కోరిక ఉంది, ఉన్నదేదో ఉంది, దానికి రూపం లేదు, నామం లేదు. అయితే మనందరికి తలో శవం ఉంది, దానికి ఒకపేరు ఉంది. మనం ఆ రూపంతోటి, నామంతోటి తాదాప్యం పొందుతున్నాము. నారూపంతోటి, నామంతోటి తాదాప్యం పొందుతున్నంతకాలం రూపాలు, నామాలు నిజం అని నాకు అనిపిస్తూ ఉంటుంది. కర్తృత్వంతో నీవు చేసేపని మంచికి మంచి, చెడ్డకు చెడ్డ నీవు అనుభవించవలసిందే. దేనికైతే మరణం లేదో, ఏదైతే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఉంటుందో, దేని స్వరూపం అయితే ఆనందమో, ఏదైతే ఎప్పడూ ఉంటుందో, ఎక్కడయితే భిన్నత్వం లేదో అది నీవై ఉన్నావు అని వేదం చెపుతోంది. మనం కూడా అది నోటితో చెపుతున్నాము కాని అది మనకు అనుభవంలో లేదు. హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తమయ్యేవరకు, అది నీకు అనుభవంలోనికి వచ్చేవరకు ఈ దేహగతమైన నేను నిన్ను విడిచిపెట్టదు, అది నిన్ను పీడిస్తూనే ఉంటుంది. మనం గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి రాగానే ముందు నేను అనే తలంపు వస్తుంది, అది దేహంతో తాదాప్యం పొందుతుంది. ఈ దేహము నేను అనే తలంపు ప్రారంభం అయ్యాక దుష్ట ఆలోచనలు వస్తాయి, వేరుబుద్ధి వస్తుంది, స్వార్థం క్రూరత్వం పెరుగుతుంది. ఉన్న వస్తువులో నుండి మనం ఎప్పడైతే జారిపోయామో కానిదంతా మనం చుట్టబెట్టుకుంటూనే ఉంటాము. ముందు నీకు నేను అనే భావన వచ్చిన తరువాత ఇతర భావనలు వస్తున్నాయి అందుచేత నీ సాధనను అంతా ఈ నేను అనే భావన మీద కేంద్రీకరించు, అది ఎక్కడ నుండి వస్తోందో చూడు అది నీ హృదయంలో నుండే వస్తోంది. లోభివాడు తన ధనాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకొంటాడో

అలాగే మనకు వచ్చిన తలంపులను, మనం చేసిన పనులను ఒక్కటి కూడా విడిచిపెట్టకుండా భగవంతుడు మన హృదయంలో దాచి ఉంచుతాడు. మనకు ఏదైనా చెడు తలంపు వచ్చినా, మనం ఏదైనా చెడ్డ పని చేసినా మనం ఏదో జన్మలో దానికి సమాధానం చెప్పాలి. అసలు నేను ఈ లోకంలో ఎందుకు పుట్టాను అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఈ లోకం మంచిదికాదు, చెడ్డదికాదు. నువ్వు ఈ లోకంలో ఎందుకు పుట్టావు అంటే నువ్వు ఎవడివో నువ్వు తెలుసుకోవటానికి భగవంతుడు నీకు ఒక అవకాశం ఇచ్చాడు, అందుకే పుట్టావు. అందుచేత నీవు వచ్చిన పని చూసుకో. ఇంక కర్మ అంటావా కొంతమంది వ్యవసాయ దారులుగా, కొంతమంది ఇంజనీర్లుగా, కొంతమంది టీచర్సుగా పనిచేస్తూ ఉంటారు, ఆ దేహ ప్రారబ్ధాన్ని బట్టి పని జరుగుతూ ఉంటుంది. ఆ దేహ ప్రారబ్ధంలో నీవు ఏ అనుభవాలు పొందాలో అవి పొందాక ఆ శరీరం చనిపోతుంది. ఈలోపుగా నీవు తొందరపడినంత మాత్రంచేత చావురాదు. నీ ముక్కులో గాలి ఎవడైతే పోసాడో వాడే తీస్తాడు. ప్లెజర్‌ను, పెయిన్‌ను కూడా నీ మైండ్ క్రియేట్ చేస్తోంది. ఉదాహరణకు ఒకరి ఇంట్లో ఎవరైనా చనిపోయారు అనుకోండి ఆ ఇంట్లో ఉన్నవారిలో ఒకరు విపరీతంగా బాధపడతారు, ఒకరు క్వయిట్‌గా, కూల్‌గా ఉంటారు. సంఘటన ఒక్కటే కాని అక్కడ తీసుకోవటంలో ఉంటుంది, మనస్సును బేలన్స్ చేసుకోవటంలో ఉంటుంది. సంఘటనను బట్టి నీకు దుఃఖంరాదు, ఆ సంఘటనను నీవు తీసుకోవటంలో, నువ్వు సమాధానపడటంలో అది ఉంటుంది. ఈశ్వర సంకల్పం ప్రకారం అలా జరగవలసి ఉంది, జరిగింది అనుకొంటే కూల్‌గా ఉంటాడు. అలా ఎందుకు జరిగింది అనే భావన మనకు వస్తూ ఉంటే మనం ఈశ్వరుడికి భిన్నంగా ఉన్నాము అనుకోవటం వలన ఆభావన వస్తోంది. ఈశ్వర సంకల్పంతో నువ్వు మమేకం అవ్వటంలేదు, ఈశ్వరుడి కంటే నేను వేరుగా ఉన్నాను అనే భావన నీకు ఉంది. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతోంది. మనకు స్వప్నంలో ఉన్నంతసేపు ఆ స్వప్నం నిజం అనిపిస్తుంది. జాగ్రదవస్థలోనికి వచ్చాక అది స్వప్నం, అది నిజంకాదు, ఇంతవరకు అది స్వప్నం అని తెలియక బాధపడ్డాము అనితెలుస్తుంది. అదేవిధంగా నీవు హృదయంలో మేల్కొనే వరకూ ఈ జాగ్రదవస్థకూడా నిజం అని నీకు అనిపిస్తుంది. నీవు హృదయంలో మేల్కొన్నప్పుడు ఈ జాగ్రదవస్థ కూడా ఒక స్వప్నమే, ఇది నిజంకాదు అని అప్పుడు నీకు తెలుస్తుంది. ఈ లోకం ఉందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఈ లోకం ఉందని ఆయన చెప్పలేదు, ఉన్న దానివలె కనిపిస్తోంది అని చెప్పారు. మనం కర్మ

మార్గంలో ప్రయాణం చేసినా, ధ్యాన మార్గంలో ప్రయాణం చేసినా, భక్తి మార్గంలో ప్రయాణం చేసినా ఈ మూలతలంపును తన మూలంలోనికి ఉపసంహరించాలి. ఒక ఉపనిషత్‌లో ఏమని చెప్పారు అంటే నీకు జీవితంలో ఏదయినా జయం కలుగవచ్చు, అపజయం కలుగవచ్చు అది నీ తెలివితేటల మీద ఆధారపడి లేదు. మీ పూర్వజన్మలో మీరు చేసిన కర్మను బట్టి ఇక్కడ జయాపజయాలు ఉంటాయి. అది కేవలము ఈ జన్మలో చేసిన కృషికాదు. ఇక్కడ జ్ఞానానంద అమృతానుభవం పొందారు అంటే ఆయన ఈ జన్మలో చేసిన కృషి మనకు తెలుసు, ఆయన ఎంతకాలం నుండి, ఎన్ని జన్మల నుండి సత్యాన్వేషణలో ఉన్నారో? అందుకే గీతలో భగవంతుడు చెప్పాడు బహుజన్మల సాధన వలన గాని, అనేక జన్మల పుణ్యఫలితం వలనగాని నీకు బ్రహ్మజ్ఞానం కలుగదు. మీరు కేవలము మీ సాధనను పూజగదికి పరిమితం చేయవద్దు, దైనందిన జీవితంలో ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండాలి.

సూర్యుడు బాహ్యమైన చీకటిని తొలగిస్తాడు. నీ లోపల గూడుకట్టుకొని ఉన్న చీకటిని ఛేధించేవాడే గురువు. నిన్ను అశాంతిలో నుండి విడుదల చేసేవాడు గురువు. గురువు అనుగ్రహం ఎలా ఉంటుంది అని అడిగితే అది మాటలకు అందదు, తలంపుకి అందదు. అందని దాని గురించి ఎలా చెప్పగలము. బాహ్యంగా ఏదో ఇచ్చి, గురువు ఋణం తీర్చుకోలేము. గురువు ఏ స్థితిని అయితే పొందాడో ఆ స్థితిని మనం కూడా పొందితే గురువు యొక్క ఋణం తీరిపోతుంది. ఎప్పడైనా మనం శాంతిగా ఉన్నప్పడు మనమూ, జ్ఞానానంద ఒక్కటే అనిపిస్తుంది. మరల ఏదో ఒకవాసన, ఏదో ఒక కోరిక మనలను డిస్టర్బ్ చేయటం ప్రారంభించింది అనుకోండి మరల అశాంతిలో కూరుకొనిపోతాము. నేను ఎవడనులో భగవాన్ ఏమని చెప్పారంటే కోటలో ఉన్న శత్రువులు అందరూ చనిపోతే కదా కోట నీకు స్వాధీనం అయ్యేది, కోటలో శత్రువులు ఉండగా కోట నాకు స్వాధీనం అయ్యింది అని ఎలా చెప్పకొంటావు. హృదయం అంతా ఖాళీ అవ్వాలి, హృదయం ఖాళీ అవ్వకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. స్వార్థంలో నుండి, దేహబుద్ధిలోనుండి విడుదల పొందకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. సాధన అంటే ఏదో పూజ చేయటం, జపం చేయటం అనుకొంటున్నారు. నువ్వు ఏ దేవతనయితే పూజచేస్తున్నావో వాడికి ఏది ఆధారంగా ఉందో అదే నీకూ ఆధారంగా ఉంది. అది తెలియక వాడు వేరు, నేను వేరు అనుకోవటం, అక్కడ నుండి ఘర్షణ ప్రారంభమవుతోంది, ఏదో సాధన చేయటం, తలకాయ పోటు వచ్చేసింది అనుకోవటం, సాధన

పేరు మీద బాధలు పడటం. భగవంతుడు మనకు నడవటానికి కాళ్ళు, చూడటానికి కళ్ళు, పనిచేయటానికి చేతులు ఎలా ఇచ్చాడో అలాగే ఆలోచించటానికి బుద్ధిని కూడా ఇచ్చాడు కాని మనం దానిని వదిలేసాము. మనకు ఏదైనా జయం కలిగింది అనుకోండి పొంగిపోతాము. జయం వరకు అక్కరలేదు పదివేల రూపాయల పట్టుచీర కట్టుకొన్నాము అనుకోండి, ఇంక ఆ రోజున చీరలో విశేషంకాదు మనలో ఏదో విశేషం ఉంది అనిపిస్తుంది, అదే మాయ. మాయ అంతా మనస్సులో పెట్టాడు. భగవంతుడు వచ్చి ప్రత్యేకంగా నిన్ను శిక్షించనక్కరలేదు, ఎవడి మనస్సు వాడికి శిక్ష, మనకు లాభం వస్తే పొంగిపోతూ, నష్టం వస్తే కృంగిపోతూ ఉంటే దేహగతమైన నేను పెరిగిపోతూ ఉంటుంది, అజ్ఞానం పెరిగిపోతుంది. నేను కూర్చొన్నాను, నేను నుంచున్నాను, నేను అది సాధించాను, నేను ఇది సాధించాను, నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను ఆ నేను వాడకం మనకు ఎక్కువ, అది పోయేవరకు మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఇప్పడు మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో అది నిజమైతే మనకు అశాంతి లేదు, అది నిజంకాదు కాబట్టే మనకు అశాంతి వస్తోంది. ఎక్కడయితే సత్యం ఉందో అక్కడే ఆనందం ఉంది, అక్కడే శాంతి ఉంది. ఎప్పడయినా మనకు కోరికలు నెరవేరినప్పడు ఇదంతా మన తెలివితేటలు అనుకొంటాము, ఏదో కొద్దిసేపు సంతోషం వస్తుంది. అది నిజం కాదు. అది కూడా ప్రకృతిలో నుండి, అనాత్మలో నుండి రావటం లేదు. కోరిక నెరవేరినప్పడు నీ మనస్సు వెళ్ళి హృదయంలో మునుగుతుంది. ఎక్కడ శాంతి ఉందో, ఆనందం ఉందో అక్కడకు నీ మనస్సు వెళ్ళి మునిగినప్పడు నీకు ఆనందం కలుగుతుంది, కాని అది కూడా బయట నుండి వచ్చినది కాదు. అది బయటనుండి వస్తోంది అని మనకు అనిపిస్తుంది అది నిజం కాదు. మీకు మామిడిపండు అంటే బాగా ఇష్టం అనుకోండి, ఆ మామిడి పండు తిన్నప్పడు చాలా బాగుంది, చాలా బాగుంది అనుకొంటాము. అప్పడు కూడా ఆనందం అనేది మామిడి పండులో నుండి రావటంలేదు, ఆ కోరిక నెరవేరినప్పడు మనస్సు వెళ్ళి హృదయంలో కూర్చుంటుంది, అప్పడు హృదయంలో ఉన్న శాంతిని, ఆనందాన్ని పీల్చుకొంటుంది. శాంతి, ఆనందం కూడా ఆత్మలోనుండి వస్తాయి కాని అనాత్మలో నుండి ఏదీరాదు, అనాత్మలో ఉన్నది డస్టే, అది మిధ్యే. ఆచార్యుల వారు ఏమని చెప్పారు అంటే సూర్యుడు కంటే మేఘాలు ఏమీ గొప్పవి కాదు, కాని సూర్యుడు కనబడకుండా చేయటానికి అవి పనికివస్తాయి. అలాగే నీ హృదయంలో ఉన్న సద్వస్తువు కంటే ఈ వాసనలు, తలంపులు, కోరికలు ఇవి ఏమీ గొప్పవికాదు

కాని హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు గోచరం కాకుండా చేస్తున్నాయి. భగవంతుడు కూడా మనకు శాంతిని ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాడు కాని మనం తట్టుకోలేము, దానికి ఇంకా మనం డిజర్వు అవ్వలేదు అందువలన వెయిట్ చేస్తున్నాడు కాని మన మీద ఇష్టం లేకకాదు. శాంతి సామ్రాజ్యానికి అధిపతిని చేయటానికి మనలను ప్రిపేర్ చేస్తున్నాడు. ఆత్మజ్ఞాన సముపార్జనకు మనోదేహములను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సరిగా ఉపయోగించుకోవటం లేదు. ఆయన మనకు ఇచ్చిన ధనాన్ని గాని, తెలివినిగాని మనం సరిగా ఉపయోగించుకోవటం లేదు. ఇంకా అవకాశాలు కావాలి అని కోరుకొంటున్నాము. ఉన్నవి సరిగా ఉపయోగించుకోవటం లేదు అని ఆయనకు తెలుసు ఇంకా కావాలంటే ఎలా ఇస్తాడు? మనకు ఏది మంచిదో మనకంటే ఆయనకు బాగా తెలుసు. భగవంతుడికి అన్నీ ఎలా తెలుస్తాయి అని కొంతమంది అంటారు అంతా ఆయనే అయినప్పుడు ఇంక తెలియటం ఏముంది. ఆయనకు భిన్నంగా ఏదీలేదు. ఒక అజ్ఞాని, జ్ఞానిని అర్థం చేసుకోలేడు, ఒకవేళ అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే ఇతనిలో ఉన్న అజ్ఞానాన్ని తీసుకొని వెళ్ళి జ్ఞానియందు ఆరోపిస్తాడు.

ఆత్మజ్ఞాన సముపార్జనకు మనలో ఉన్న బలహీనతలే అడ్డు వస్తున్నాయి. ఇందులో మనం సంపాదించేది ఏదీ లేదు, వాటిని తొలగించుకోవాలి. భగవదనుభవం పొందటానికి ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో, ఏ కారణాల వలన మనం భగవంతుడికి దూరమయ్యామో వాటిని ఒక్కోటి ఒక్కోటి తొలగించుకొంటూ రావాలి. మౌనం చాలా శక్తివంత మైనది. కొంతమంది ఏమీ మాట్లాడరు, మౌనంగానే జ్ఞానం ఇచ్చేస్తారు, దక్షిణామూర్తి అటువంటి వారే. వారు మాట్లాడరు, వారి చూపే జ్ఞానం, వారి ప్రతికదలిక కూడా జ్ఞానమే. వారు మీ వంక చూసారు అనుకోండి, ఒకసారి లోపల మిమ్మల్ని స్మరించుకొన్నారు అనుకోండి అంతే మీరు పవిత్రులు అవుతారు, వారు ఏదిగా ఉన్నారో అది మీకు ఇవ్వబడుతుంది. మీకు అర్హత వచ్చినప్పడు, యోగ్యత వచ్చినప్పడు బ్రాహ్మీస్థితిని ఇవ్వటానికి భగవంతుడు ఒక్క క్షణం కూడా వెయిట్ చెయ్యడు. కోరిక లేకపోతే ఇవ్వడేమో అని చాలామంది అనుకొంటారు కోరికకు శక్తిలేదు, శక్తి ఈశ్వరుడిది. నీకు అర్హత వచ్చినప్పడు వెంటనే భగవంతుడు ఎరుకలోనికి వస్తాడు, అదే జ్ఞానం. గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి వచ్చినప్పడు ఈ దేహగతమైన నేను మనలను చుట్టుకోక ముందు ఎంత ప్రశాంతంగా మేల్కొంటామో అలాగ ఈశ్వరుని

దయ మనకు కలిగినప్పడు అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి అలా మేల్కొంటాము. నువ్వు కాని దానిని చింతించినా అది నువ్వు అవ్వవు. నువ్వు దేహం అనుకొన్నప్పడు నువ్వు చైతన్యమే, నువ్వు మనస్సువు అనుకొన్నప్పడు కూడా నువ్వు చైతన్యమే, ఈదేహం చనిపోతుంది అనుకొన్నప్పడు కూడా నీవు చావు లేకుండానే ఉన్నావు. చనిపోతోంది అనుకోవటం కూడా నిజం కాదు, అది కూడా ఒక తలంపే. ఆ తలంపు ఎవరికి వస్తోంది? నేను అనే తలంపుకు ఈ తలంపు వస్తోంది. ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందో, ఆ సోర్సులోనికి వెళ్ళే వరకు అది నిన్ను విడిచిపెట్టదు. రైలు ఇంజను కదిలితే దాని వెనకాల ఉన్న బోగీలు అన్నీ ఏవిధంగా అయితే కదులుతాయో అలాగే ఈ నేను అనే తలంపు వచ్చింది అంటే దానిలోనుండి లోకం వస్తుంది, దేహం వస్తుంది, పుణ్యపాపాలు వస్తాయి. వరుసపెట్టి అన్నీ వచ్చేస్తాయి, ఇది అంతా ఒక పెద్ద అడవి అందులో నుండి బయటపడలేము. ఎవడో ఒక మహాత్ముడు ఇంటర్‌ఫియర్ అయితేగాని ఈ అడవిలోనుండి మనం బయట పడలేము. ఏదైతే నేచురల్‌గా ఉందో, ఏదైతే నార్మల్‌గా ఉందో, ఏ వస్తువుకయితే మరణం లేదో అది నీకు అనుభవంలోనికి వచ్చేవరకు నిన్ను ప్రకృతిగుణాలు విడిచిపెట్టవు, ఈ సంసారం నిన్ను విడిచిపెట్టదు, ఇవి నిన్ను పీడిస్తూనే ఉంటాయి, ఇందులో నుండి పారిపోవటానికి నీకు అవకాశం లేదు. నువ్వు ఆత్మని ధ్యానం చెయ్యి, భగవంతుడిని ధ్యానం చెయ్యి. నువ్వే అసలు ఏడుస్తున్నావు ఇంకో ఏడ్చేవాడిని ధ్యానం చేయటం ఏమిటి? నువ్వు చావటానికి సిద్ధంగా ఉన్నావు, ఇంకో చచ్చేవాడిని పట్టుకొంటావు ఏమిటి? చావులేని వాడిని ఆశ్రయించు. నువ్వే మోహం పెట్టుకొని ఇంకో మోహం ఉన్నవాడిని ఆశ్రయించటమా? ఇద్దరూ కలిసి గోతిలో పడటం. అంటే ఒక గుడ్డివాడు ఇంకో గుడ్డివాడికి దారి చూపటంలా ఉంది. చావు ఎలా ఉంటుందో, పుట్టుక ఎలా ఉంటుందో, దుఃఖం ఎలా ఉంటుందో, మోహం ఎలా ఉంటుందో తెలియనివాడిని, అంతా తానైన వాడిని ధ్యానించు, వాడు నీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. నన్ను ఆరాధించగా ఆరాధించగా, ప్రేమించగా ప్రేమించగా, నీకు ఇష్టమైన పనులను ఒక ప్రక్కన పెట్టి నేను ఎలా జీవించమని చెబుతున్నానో అలా జీవిస్తూ ఉంటే, నా ఇష్టాన్ని నీ ఇష్టంగా చేసుకొని బతుకుతూ ఉంటే నీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుందో అటువంటి బుద్ధిని నీకు నేను ప్రసాదిస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. అందుచేత నీవు ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు, ఆయన యందు భక్తి కలిగి ఉండు, విశ్వాసం కలిగి ఉండు. పండు ఇవ్వండి, పుష్పం ఇవ్వండి ఇవికాకపోతే

కనీసం నీళ్ళయినా ఇవ్వండి అని భగవంతుడు చెపుతున్నాడు. అంటే అలా ఇవ్వటం అలవాటు అయితే ఎప్పడో ఒకప్పడు అజ్ఞానాన్ని ఇచ్చేస్తాము అని ఆయన అలా చెపుతున్నాడు అంతేగాని మనం ఇచ్చేవి ఆయన ఏమి చేసుకొంటాడు. మనకు ఇచ్చే అలవాటు లేదు ఎంతసేపు తినటమే పని. మీకు హితవు అయినది కూడా మితంగా తినండి, అది శుచిగా ఉండాలి అని చెపుతున్నాడు. అటువంటి ఆహారం మంచి మనస్సు రావటానికి సహకరిస్తుంది అంటే ఆహారశుద్ధిలో నుండి మనస్సుకు శుద్ధి వస్తుంది. పవిత్రమైన మనస్సు మాత్రమే సత్యాన్వేషణకు ఫిట్ అవుతుంది. నేను ఏదో చేసేస్తున్నాను, ఎవరినో ఉద్ధరిస్తున్నాను అని జ్ఞాని అనుకోడు ఎందుచేతనంటే జ్ఞానికి ఆత్మ తప్పించి ఏదీ గోచరించదు, తాను ఆత్మ అయి ఉన్నాడు, తనకు భిన్నంగా ఏమీ కనబడదు. అందుకే రమణాచార్యుడు ఒక సందర్భంలో ఏమి చెప్పారు అంటే నేనే కనుక అజ్ఞానంలో ఉంటే మీకు బోధించటానికి నా దగ్గర ఏమీలేదు, నేను కనుక జ్ఞానిని అయితే నాకు బోధించటానికి ఇతరులు లేరు. ఇది రమణ వాక్యం దానిని మీరు సొంతం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి, దానిని మననం చేసుకోండి. ఏదో రోజున మీకు అనుభవంలోనికి వస్తుంది.

ప్రపంచంలో ఏ వస్తువు నీది కాదు. అంతా పరమాత్మదే. ఇంక త్యాగం ఏమిటి? ఇదే భగవాన్ చెప్పారు ఒకడు బెల్లంతో వినాయకుడిని చేసి, నైవేద్యం పెట్టటానికి ఏమీ దొరకక ఆ వినాయకుడినే గిల్లేసి నైవేద్యం పెట్టేసాడు. మనం చేసేదానాలు, ధర్మాలు అటువంటివే భగవంతుడిది భగవంతుడికే ఇచ్చి మనం పొగరుబోతుతనం పెంచుకోవటం, ఇంక మనకు జ్ఞానం ఎలా వస్తుంది. ఈ కథ మనకు అర్థమయితే మన పొగరుబోతుతనం, అహంభావన అణిగిపోతుంది. మనం విషయాలను తాగి తాగి తాగుబోతులమయ్యాము. సబ్జక్టు అర్థమవుతూ ఉంటేనేగాని ఈ తాగుబోతుతనం, పొగరుబోతుతనం అణగదు. వాడు ఆ తప్ప చేసాడు, వీడు ఈ తప్ప చేసాడు వారిని చంపేస్తాను అని ఆంజనేయస్వామి అంటే చిన్న తప్ప కూడా చేయని వాడిని ఈ సృష్టిలో ఒకడిని చూపించు అంటుంది సీతమ్మ. అసలు జీవభావన వస్తేనేవాడు ఏదో తప్ప చేస్తాడు. మీ గురించి మేము అరుణాచలం వచ్చాము అని భగవాన్‌తో ఎవరైనే అంటే మరి నేను ఎవరి గురించి వచ్చాను. ఏ ఈశ్వరుడు అయితే నన్ను ఇక్కడికి తీసుకొని వచ్చాడో ఆయనే మిమ్మల్ని తీసుకొనివచ్చాడు. ఉన్నది ఒక్కటే. ఎవడైతే నాకు జ్ఞానాన్ని ప్రసాదించాడో వాడే మీకు కూడా జ్ఞానాన్ని ఇస్తాడు. జ్ఞానమే నిజమైన సంపద.

జ్ఞానానికి సమానమైనది ఏదీ లేదు. కొంతమంది రేపు ఏమి జరుగుతుందో చెపుతారు. రేపు ఏమి జరుగుతుందో తెలుసుకోవటం జ్ఞానం కాదు. మీ పూర్వ జన్మల గురించి, రాబోయే జన్మల గురించి ఎవరైనా చెప్పవచ్చు, అది జ్ఞానం కాదు. ఇదంతా మనస్సే, ఇదంతా దుమ్మే. ఇల్లు ఊడ్చి బయట పారవేయవలసిన చెత్తను కొంటు చేయటం ఎందుకు? ఈ జన్మ ఎంత నిజమో, పూర్వ జన్మలు, రాబోయే జన్మలు కూడా అంతే నిజం. అది జ్ఞానం కాదు. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు ఎలా ఉందో నీవు అలా ఉండగలగటం జ్ఞానం. మనకు జీవభావన పోవాలి, ఆత్మభావన రావాలి. జీవ భావనను తగ్గించుకొంటూ ఆత్మభావన పెంచుకొంటూ ఉండాలి. వచ్చే జన్మలో ఏదో చేద్దాం, మరణించిన తరువాత ఏదో అవుతాము అని మీరు అనుకోవద్దు, ఇటువంటి గొడవలు వద్దు. ఈ జన్మలో కాలాన్ని సద్వినియోగం చేసుకోండి, భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకోండి. భగవంతుడు మనకు ఏదైనా ఇచ్చినప్పుడు అది ఎంత ఇచ్చాడు అని కాదు, ఇచ్చిన దానిని ఎంత వరకు మనం సద్వినియోగం చేసుకొంటున్నాము అనేది ముఖ్యం. మనకు ఎంత ధనం ఉంది అని కాదు దానిని ఎంతవరకు సద్వినియోగం చేస్తున్నాము అది చూసుకోవాలి. అదృష్టం వెంటాడినప్పుడు పొంగిపోకుండా, దురదృష్టం వెంటాడినప్పుడు కృంగిపోకుండా ఉండాలి. అదృష్టం, దురదృష్టం ఇవి అన్నీ దేహానికే, చైతన్యంలో, మహాజ్ఞానంలో అక్కడ ఇవి ఏమీ లేవు. ఉన్నది ఒక్కటే, అక్కడకు మనం మేలుకోవాలి, అంతవరకు మనం దుఃఖ రహిత స్థితిని పొందలేము. మీ ఇంటి దగ్గర ఏమైనా ఇబ్బందులు ఉన్నా అస్తమానూ ఆ ఇబ్బందులుతో తాదాప్యం పొందవద్దు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి, మీ పనులు మీరు చూసుకోండి. మీ వాక్కును ఉపసంహరించండి, మీ మనస్సును ఉపసంహరించండి, మూలతలంపు అది ఎక్కడ అయితే ఉదయించి వస్తోందో అక్కడకు దానిని ఉపసంహరించండి. మూలతలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, అది నశించినప్పుడు నీవు నశించవు ఎందుచేత నంటే అది నీవు కాదు కాబట్టి. ఎప్పుడయితే మూలతలంపు నశించిందో నీవు ఏదిగా ఉన్నావో అది నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది, ఇది అనుభవైక వేద్యం.

**సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 16-01-2005, జిన్నూరు**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన శరీరంలో ఏవైనా రోగాలు ఉంటే అవి తగ్గించుకోవటానికి మనం కంగారు

పడతాము. కాని మన మనస్సులో వంకరలు ఉంటే, బుద్ధిలో వంకరలు ఉంటే, మనస్సులో శోకం ఉంటే అది పోగొట్టుకోవటానికి తగిన సాధన చెయ్యటం లేదు. మన మనస్సుకాని, బుద్ధికాని, ఇంద్రియాలు కాని ఇవి ఏమీ ఆత్మకాదు,మనం ఆత్మను చేరుకొనేవరకు అందులో ఐక్యం అయ్యేవరకు మనకు తిక్క కుదరదు, ఈ చనిపోవటం, పుట్టటం ఆగదు, పునర్జన్మలు వస్తూనే ఉంటాయి. గురువు అంటే కేవలం చదువు చెప్పేవాడు అని కాదు, మన క్షేమం కోరేవాడు, జ్ఞానం ప్రసాదించేవాడు గురువు. కాలుకాలిన పిల్లిలా ఈ భూమిమీద తిరిగేస్తే మోక్షం ఇక్కడ ఎక్కడా లేదు, పాతాళలోకంలో అసలు లేదు అక్కడ ఉన్నది కటిక చీకటి మరి మోక్షం ఎక్కడ ఉంది అంటే ఆత్మజ్ఞానంలోనే మోక్షం ఉంది, ఆత్మజ్ఞానం గురువు అనుగ్రహం వలన వస్తుందని వశిష్ఠులవారు రాముడికి చెప్పారు. మనలో సత్వగుణం, రజోగుణం, తమోగుణం ఉన్నాయి. ఈ గుణాలలో నుండే కోరికలు వస్తాయి, సంతోషం, దుఃఖం, గర్వం, పునర్జన్మలు అన్నీ ఈ గుణాల వలననే వస్తాయి. ఈ గుణాలను తొలగించుకోవటానికి మనం ఎవరూ సాధన చేయటం లేదు, అసలు ప్రయత్నం చేయటం లేదు. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది ఒక తలంపు మాత్రమే, దానిని చుట్టుకొని కోరికలు, కాంక్షలు, జన్మలు ఉన్నాయి. మనలో ఉన్న కుట్రను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయటం మానివేసి భగవంతుడిలో దోషాలు ఉన్నాయని వెతుకుచున్నాము. మనం ఇలా తయారయ్యాము. నాలో దోషాలు ఉన్నాయనుకొని వాటిని వెతకటం ప్రారంభిస్తే నేను చెప్పినమాట మీద మీ బుద్ధి ఎలా నిలబడుతుంది, అసలు మీరు ఎలా బాగుపడతారు అంటున్నాడు భగవంతుడు. ప్రతీ మనిషికి లోపల శత్రువులు, బయట శత్రువులు ఉంటారు. బయట శత్రువుల కంటే లోపల శత్రువులే ప్రమాదం. నమ్మాళ్వార్ ఏమన్నారు అంటే ఓ నారాయణా నీవు చైతన్యమే స్వరూపంగా కలవాడవు అట్టి నిన్ను ఆరాధించకుండా, నీ నామాన్ని స్మరించకుండా, నీ పాదాలను ఆశ్రయించకుండా లోపల శత్రువుల నుండి విడుదల పొందటం సాధ్యం కాదు అన్నారు. ఈ లోపల శత్రువులుశరీరం చనిపోయాక కూడా మన కూడా వచ్చేస్తారు, ఈ లోపల శత్రువులు మన మనస్సులో ఉంటాయి, ఇవే చాలా ప్రమాదం. మాకు పునర్జన్మ ఉంటుందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. అది నన్ను అడగటం ఎందుకయ్యా అది నీకే తెలుస్తుంది. మనస్సు మిగిలితే చావాలి, పుట్టాలి అన్నారు, దీనికి ఋజువులు, సాక్ష్యాలు అక్కరలేదు, శాస్త్రాలతో పనిలేదు. కర్పూరం వెలిగిస్తాము అది పూర్తిగా కాలిపోతే ఇంక ఏమీ మిగలదు, సగం కాలి సగం

ఉండిపోయింది అనుకోండి మళ్ళీ వెలిగిస్తే మరల కాలుతుంది అలాగే నీ మనస్సు మిగిలిందా నీకు పునర్జన్మ వస్తుంది. దీనికి నీకు నువ్వే సాక్షి ఎందుకంటే గుణాలు అన్నీ, అజ్ఞానం అంతా మనస్సులో ఉంది కొంతమంది భగవంతుడికి గుణాలు లేవు అంటారు. గుణాలతో ఉన్నవాడే భగవంతుడు అని వైష్ణవులు అంటారు. రామకృష్ణుడు ఏమని చెప్పారు అంటే కళ్యాణ గుణాలు ఉన్నవాడే దేవుడు, గుణాలు లేకపోయినా వాడే దేవుడు. మంచు గడ్డ గుణాలతో ఉన్న దేవుడు అనుకొంటే, నీరు గుణాలు లేని దేవుడు అన్నారు. వాడు వీడు ఒక్కటే, ఉన్నవాడు ఒక్కడే అని చెప్పారు. మీ ప్రాణాలకు ప్రాణంగా, మీ ఆత్మలకు ఆత్మగా, మీరు చేస్తున్న పనులకు సాక్షిగా మీ లోపల అంతర్యామిగా ఉన్నవాడు పరమాత్మే. బ్రాహ్మీస్థితిని పొందటానికి నాలో ఏ బలహీనతలు అయితే అడ్డుగా ఉన్నాయో వాటిని బయటకు తీసి కాల్చు, అక్కడితో సరిపోదు నన్ను కళ్యాణ గుణాలతో నింపు. నువ్వు నాకు గురువుగా ఉండి, నన్ను తీర్చి దిద్ది, నన్ను సంస్కరించి నీ స్వరూపం పొందటానికి యోగ్యుడిగా చెయ్యవయ్యా. నాకు అర్హతను కలుగజేసి నీ అంతటివాడిని చేసి నీ స్వరూపాన్ని నాకు ఇయ్యి అరుణాచలా అంటారు భగవాన్. నా దగ్గర అహంకారం తప్పించి ఏముంది. అహంకారం అశాంతి ఉంది, ఈ మట్టిని నీకు ఇస్తాను నీ దగ్గర ఉన్న బంగారంలాంటి ఆత్మను నాకు ఇయ్యి. ఈ బేరంలో నీకు నష్టమే, నేనే లాభం పొందుతున్నాను, అయినప్పటికీ ఈ బేరాన్ని అంగీకరించు అంటున్నారు.

మీ అందరి హృదయాలలో ఆత్మగా, చైతన్యంగా ఉన్న నన్ను స్మరించటం, ఆరాధించటం మానివేసారు అంటున్నాడు పరమాత్మ. ఆయనలో ఉన్న దోషాలను వెతకటం ప్రారంభిస్తే ఇంక మనం ఏమి బాగుపడతాము. మనమాట, చేత, భావన అంతా భగవంతుడిని తెలుసుకొనేలా ఉండాలి, గురి అంతా అక్కడ ఉండాలి. మన భావం మంచిది అయినా భాష బాగుండాలి, క్రమంగా ఉండాలి, తింగర తింగరగా మాట్లాడకూడదు. కొంతమందికి దయ ఎలా ఉంటుందో తెలియదు, తెలియకపోయినా ఫరవాలేదు మాకు ఆత్మజ్ఞానం ఎప్పుడు వస్తుందని వారు అడుగుతూ ఉంటారు. వారికి ఆత్మజ్ఞానం ఎవరిస్తారు. భగవంతుడు లోపల అంతర్యామిగా ఉన్నాడు కదా ఆయనను ఎలా మోసం చేయగలము. ప్రపంచం ఉంది, భగవంతుడు లేడు అనుకొంటున్నాము గాని ఉన్నది భగవంతుడే ప్రపంచం లేనేలేదు. భగవాన్ ఏమి చెప్పారు అంటే స్వప్నావస్థకు జాగ్రదవస్థకు పెద్ద తేడా ఏమీ లేదు జాగ్రదవస్థ పొడుగ్గా ఉంటుంది కాబట్టి నిజం అనిపిస్తుంది అని చెప్పారు. నీవు నిద్రపోయేటప్పుడు ఎక్కడకు వెళుతున్నావో తెలియదు,

మరల నిద్రలో నుండి వచ్చేటప్పుడు ఎక్కడ నుండి వస్తున్నావో తెలియదు కాని లోకం గొడవ అంతా నీకే కావాలిరా మొద్దబ్బాయి ముందు అదేమిటో తెలుసుకో అని చెప్పారు. కొంతమంది మనస్సులో ఏవో కల్పించుకొని వారే ఏడుస్తూ ఉంటారు. అది మనస్సుకు సంబంధించిన జ్వరం, ఆ సంతాపం లేకుండా చూసుకో అప్పుడు నా దయకు పాత్రుడవుతావు అంటున్నారు భగవాన్. ఆశ లేకుండా ఉండు. ఈశ్వరుడు కర్మఫలధాత. నువ్వు ఆశ పెట్టుకొని చేస్తే ఎక్కువ రాదు, అది ముందు గ్రహించు అంటున్నారు. నీపని ఏదో నువ్వు చేసుకో కాని బంధింపబడకు. మనకు పని వలన దుఃఖం రాదు, మమకారం వలన దుఃఖం వస్తుంది. మనకు దేహము తెలుసు, బుద్ధి తెలుసు, నిద్ర తెలుసు, మీకు తెలిసినవి ఏమీ ఆత్మకాదు. ఆత్మ మాటకు మనస్సుకు అందదు. మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచు అప్పుడు మనస్సు హృదయంలో కరిగిపోతుంది, నీకు ఆత్మానుభవం కలుగుతుంది. మనం పరమేశ్వరుని పట్ల భక్తిగా ఉండటం వలన మనస్సు కరిగిపోతుంది, మనస్సు కరగటానికి భక్తి కూడా ఒక సాధన. మన మనస్సు ద్వారా ఈశ్వరుడికి సన్నిహితంగా ఉండటం వలన, ఆ స్మరణ వలన మనస్సు కరిగిపోతుంది, ఒకవేళ కొంత కరిగి కొంత మిగిలిపోయింది అనుకోండి మిగిలిపోయిన మనస్సు మరల పునర్జన్మకు కారణం అవుతుంది, అప్పుడు మరల సాధన చేయాలి. మనస్సు దేనిమీద వాలకుండా ఉండటం వైరాగ్యం, నిరంతరం మన మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచటం వలన అది కరిగిపోతుంది. మీ పని ఏదో మీరు చేసుకొంటూ మిగతా టైము అంతా భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకోండి. మనకు నిద్రలో ఒక స్వప్నం వస్తుంది అది వెళ్ళిపోతుంది, మరల ఇంకో స్వప్నం వస్తుంది. స్వప్నం తరువాత స్వప్నం వస్తుంది. అలా వెళ్ళిపోతూ ఉంటాయి. అజ్ఞానంలో శరీరాలు వస్తున్నాయి, చనిపోతున్నాయి మరల కొత్త శరీరాలు వస్తున్నాయి ఇదంతా అజ్ఞానంలో జరిగిపోతోంది. ఇందులో నుండి మేల్కొనాలి అప్పుడు మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. నిద్రపోయిన వాడు మేల్కొంటాడు, మేల్కొన్నవాడు తిరిగి నిద్రపోతూ ఉంటాడు. ఇవన్నీ జీవ లక్షణాలు. ఆత్మ నిద్రపోదు, మేల్కొనదు, మెలుకువకు, నిద్రకు, స్వప్నాలకు ఆధారంగా ఉన్నది ఆత్మే, అదే అనంతం, వాడే గోవిందుడు ఆనందాన్ని ఇచ్చే వాడే గోవిందుడు, వాడే అచ్యుతుడు, వాడే అనంతుడు. రూపరహితంగా, నామరహితంగా మన హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడు ఆయనే, ఆయనను మనం పట్టుకోలేక పోతున్నాము కాబట్టి విగ్రహాలను ఆరాధించమని చెప్పారు. విగ్రహారాధన వలన మనస్సుకు


ఏకాగ్రత కలుగుతుంది. మనం చనిపోయే వరకు ఏదో రూపాన్ని నామాన్ని పట్టుకొని ఉంటున్నాము. అందులో నుండి విడుదల పొందలేక పోతున్నాము. అందుచేత భగవంతుడికి ఒక రూపాన్ని కల్పించి, ఒక నామాన్ని కల్పించి వాటిని స్మరిస్తూ, ధ్యానిస్తూ భక్తిగా ఉండమని చెపుతున్నారు. గోపికలకు పరమాత్మ తప్పించి ఏమీ తెలియదు, వారికి పరమాత్మ తప్పించి ఏమీ గోచరించటం లేదు. అందుచేత వారే జ్ఞానులు, వారే భక్తులు, వారే ఆచార్యులు. మనలో ఏదో బలహీనత ఉంటే దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. అసలు పరమాత్మ తప్పించి ఏమీ గోచరించనప్పడు ఇంక ఏమీ తొలగించుకొంటావు, ఇంక ఎక్కడకు వెళతావు. అట్టి వారు గోపికలు.

ఆత్మజ్ఞానంతో సమానమైనది ఈ లోకంలోగాని, పరలోకంలోగాని ఏమీలేదు. దానితో సమానమైనదే లేనప్పడు దానికి మించినది ఎలా ఉంటుంది. అట్టి ఆత్మజ్ఞానాన్ని నేను అని భగవంతుడు చెపుతున్నాడు. మనం ఏదైనా దేవాలయానికి వెళ్లినప్పడు భగవంతుడిని మన జీవితం జ్ఞానమయం చేయమని అడగాలి. నమ్రతగల పెద్దవారిని ఆశ్రయించి, గురువును ఆశ్రయించి ఎప్పడు ఎక్కడ ఎలా అడగాలో వినయంగా అడిగి ఆత్మవిద్యను నేర్చుకొని తరించు అని భగవంతుడు చెపుతున్నాడు. మనస్సు అక్కడకు వెళుతోంది, ఇక్కడకు వెళుతోంది, అనుకోవద్దు మనస్సులో గుణాలు ఉంటాయి, ఆ గుణాలు చలింపచేస్తాయి. మనస్సును ఎక్కువసేపు హృదయంలో నిలబెట్టి ఉంచటానికి ప్రయత్నం చెయ్యి. మనస్సు బయటకు వెళితే దుఃఖం, లోపలకు వెళితే సుఖం. మనస్సు బయటకు వెళితే బంధం, లోపలకు వెళితే మోక్షం. మీకు అక్కరలేని తలంపులు అన్నీ ఆగిపోతున్నాయి అనుకోండి మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందుతున్నట్లు కొండ గుర్తు, ఆ తలంపులే మనలను బంధిస్తాయి. మీరు మనస్సును ఆత్మమీద నిలబెట్టలేకపోతూ ఉంటే మీకు ఇష్టమైన దేవుడి రూపం మీద అంటే రాముడి మీద కృష్ణుడి మీద నిలబెట్టి ఉంచినా మీకు వచ్చే తలంపులు, వికారాలు ఆగిపోతాయి. నువ్వు అలా చేయగా చేయగా మనస్సుకు విశ్రాంతి వస్తుంది. మనం సాధన చేయగా చేయగా మనకు శాంత చిత్తం కలగాలి. మనకు శాంత చిత్తం లేనప్పడు ఎంత బలగం ఉన్నా ఏమీ సుఖపడలేము. స్త్రీకి అనుకూలమైన భర్త దొరికితే అదృష్టం అంటారు, భర్తకు అనుకూలమైన భార్య దొరికితే అది అదృష్టం అంటారు, ఎవరికైనా ఏదైనా కలిసివస్తే అది అదృష్టం అంటారు కాని వీరందరికంటే శాంతచిత్తము కలవాడు అదృష్టవంతుడు. మనం ఒక గంట ఎండలో

ఉండి నీడలోనికి వస్తే అమ్మయ్య అనుకొంటాము, విశ్రాంతి వస్తుంది అలాగే దేవునివైపుకు వెళ్లిన మనస్సుకు విశ్రాంతి కలుగుతుంది, సుఖపడుతుంది. ఆత్మలో మనస్సు స్థిరపడితేనేగాని అది కరగదు, అది కరిగితేనేగాని మనకు జన్మరాహిత్యం రాదు అంటున్నారు. కళ్యాణ గుణాలు కలవాడు నారాయణుడు, ఆ గుణాలను స్మరించగా స్మరించగా మనం పవిత్రులమవుతాము. నువ్వు అందరిలాగే కనిపిస్తున్నావు కాని నీ చూపు వెలుగులో ఏమాటున ఉన్నదో ఇంత మహత్తర ప్రేమ, ఏ చాటున ఉన్నదో ఇంత అనంతశక్తి చాటుమాటుల్లేని చల్లని రమణా అంటారు చలంగారు. మనలో ఉన్న గుణాలు, వాసనలు, సంస్కారాలు ఇవి అన్నీ కూలిపోతేగాని మనస్సు నశించదు. మనస్సు నశిస్తేగాని మనకు ఉన్న వస్తువు ఉన్నట్లుగా వ్యక్తంకాదు. మనకు జ్ఞానం వచ్చాక అనిపిస్తుంది నన్ను జ్ఞానంలోనికి మేల్కొలపటానికి ఇన్ని జన్మలు నాకూడా ఉండి నేను తిట్టినా నన్ను విడిచిపెట్టకుండా నావెంట ఉండి ఈస్థితికి తీసుకొని వచ్చి నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావు అని అప్పుడు మనకు తెలుస్తుంది. ఒకోసారి మనకు దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తాడు మరల దూరం అయిపోతున్నట్లు అనిపిస్తుంది, ఒకోసారి మనలను విడిచిపెట్టేసినట్లు అనిపిస్తుంది. మన బుద్ధిలో ఉన్న వంకరలు తీయటానికే ఇవి అన్నీ చేస్తున్నాడు, ఆయన స్థితికి నిన్ను తీసుకొనిపోవటానికే ఇవి అన్నీ చేస్తున్నాడు. గురువు చేసేపని, గురువు యొక్క శక్తి ఎలా ఉంటుంది అంటే ఇక్కడ వందమంది ఉన్నారు అనుకోండి అందులో ఒకరిని అనుగ్రహిస్తున్నాడు అనుకోండి ఆ ప్రక్కవాడికి కూడా అది తెలియదు, అట్టివాడు గురువు, ఆయన చేసేపని సైలెంటుగా చేసుకొనిపోతాడు. భగవంతుడిని నిరంతరం స్మరించగా స్మరించగా మనస్సుకు పవిత్రత వచ్చేకొలది, మనస్సుకు ఏకాగ్రత వచ్చేకొలది అది ఉరుక్కొంటూ ఉరుక్కొంటూ వెళ్లి హృదయంలో మునిగి హృదయాకారం చెందుతుంది. మనం ఏదైతే నేను, నేను అంటన్నామో అది కృత్రిమమైనది, అది నిజంకాదు. అది ఒక తలంపు మాత్రమే. కాని ప్రమాదం ఎక్కడ వచ్చింది అంటే దానికోసమే మనం బతుకుతున్నాము అందుచేత మనం ఫెయిల్ అయిపోతున్నాము. మన ఆటలు, పాటలు, మాటలు, మనం చేసే పనులు అన్నీ అహంకారం కోసం చేస్తున్నాము. ఈ దేహం జడము, దీనిలోపల ఒక సద్వస్తువు ఉంది, దానికోసం ఎవడైతే జీవిస్తున్నాడో, దానిని ఎవడైతే అనుభవైకవేద్యం చేసుకొన్నాడో వాడిని మహాయోగి అంటారు.

నన్ను అందరూ మహాత్ముడు అంటున్నారుకాని నన్ను ఎవడైతే చంపుతూ ఉంటే వాడి

మీద నాకు ఉద్రేకం కాని, కోపం కాని లేకుండా ఉండగలిగితే అప్పుడు కదా నేను మహాత్ముడను అన్నారు గాంధీగారు. వేరుబుద్ధి వలననే మనకు ఎక్కువ తలంపులు వస్తున్నాయి. వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అని కొంతమంది అంటూ ఉంటారు. ఇవన్నీ దొంగ నేనుకే. ఈ దొంగ నేను ఆ దొంగ నేనుల కోసం ఏడుస్తూ ఉంటుంది. దీనివలన మనస్సు చిక్కబడిపోతూ ఉంటుంది, పునర్జన్మలు రావటానికి కొన్ని వేల సంస్కారాలు అక్కడ కలుగుతూ ఉంటాయి. నువ్వు అంటూ ఉంటే వారు ఉన్నారు లేకపోతే వారు ఎవ్వరూ లేరు. అందుచేత ఆత్మజ్ఞానం సంపాదించేవాడు కత్తి అంచు మీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో అంత జాగ్రత్తగా ఉండాలి, అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు, ప్రతిక్షణం సద్వినియోగం చేసుకోవాలి. మనం వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉండాలి, గాలిలో మేడలు కట్టకూడదు. మీ మనస్సు ఎన్ని రకాలుగా ఉన్నా, మీలో ఎన్ని సంస్కారాలు ఉన్నా మీరు మతాలు మార్చుకొన్నా, కులాలు మార్చుకొన్నా మీలోపల ఉన్న భగవంతుడు మారుతాడా? ఆయన మారడు, ఆయన అలాగే ఉన్నాడు. ఉన్నది ఒక్కటే అదే సత్యం, అదే నిత్యం, అది నిరాకారం, అది నిర్విషయం, వాడే గోవిందుడు. ఒక ప్లీడరుగారు భగవాన్‌కు గిరిని చూపించి అది రాళ్లగుట్టే కదా, కొండే కదా అన్నారు. నన్ను ఎక్కడ నుండో ఇక్కడకు తీసుకొని వచ్చి, నన్ను ఆకర్షించి, నన్ను అనుగ్రహించి, అమృతానుభవం కలుగజేసిన వాడు ఆయనే. నీకు రాయి అయితే అవ్వవచ్చు, నాకు దేవుడు, నేను కృతజ్ఞతాహీనుడిగా ఎలా ఉండగలను అన్నారు భగవాన్, నీ మనస్సు రాయి అందుకే రాయిలా కనిపిస్తోంది అన్నారు. ప్రతి మనిషికి కొన్ని పరిసరాలు ఉంటాయి. ఇటువంటి పరిసరాలలో పుట్టాము ఏమిటి అని ఏడుస్తూ కూర్చోవద్దు. సహనం పెంచుకొని ఆ పరిసరాలను దాటి ఆత్మజ్ఞానం సంపాదించండి అంటున్నారు భగవాన్. మీ చుట్టూ నాస్తికులు ఉండవచ్చు, మీ మనస్సును మిత్రుడిగా చేసుకొని వారిని అతిక్రమించండి. సహనం పెంచుకొని వాటిని అతిక్రమించి భగవంతుడి రూపాన్ని పొందండి. మీ ఊరునుండి ఉత్తరం వచ్చింది అని ఎవరైనా చలంగారితో అంటే ఇంక ఊరు ఏమిటి? దేహభావన ఉన్నవాడికి ఊళ్ళుకాని, ఆత్మకు ఊరు ఉందా? అసలు మనం జ్ఞానం దాకా వెళ్ళనక్కరలేదు సత్వగుణం పెంచుకొంటే ఏ ఊరు వెళ్ళినా మన ఊరు వెళుతున్నట్లే అనిపిస్తుంది, ఏ ఇంటికి వెళ్ళినా మన ఇంటికే వెళ్ళినట్లు అనిపిస్తుంది.



తాడినాడలో సద్గురు శ్రీ నాన్నగారు



జిన్నూరులో సద్గురు శ్రీ నాన్నగారు




REGISTERED NEWS PAPER

RNI NO. APTEL/1999/1667

**Postal Regn.No.PMG/VJ/1-3/03**

**Prepayment : Tech-31/Pre.Pmt/BMV/02**

Postage
Prepaid

To

306. **B. Subba Lakshmi**
C/o P.V.S.V.K. Varma,
151, Rao & Raju Colony,
Banjara Hills, Road No - 2,
HYDERABAD - 34

If undelivered please return to :
**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM
JINNURU - 534 265. W.G. Dt. A.P.